క్లుప్తంగా

వెందోటికి యాచేంద్ర పరామర్శ



సుగుణమ్మకు నివాళులర్పిస్తున్న సర్వజ్ఞకుమార యాచేంద్ర

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం జయంపు గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ వెందోటి మధుసూదన్‌రెడ్డి తల్లి సుగుణమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు సర్వజ్ఞకుమార యాచేంద్ర బుధవారం జయంపు చేరుకుని వెందోటి సుగుణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెందోటి మధుసూదన్‌రెడ్డి, వెందోటి మనోహర్ రెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డిని పరామర్శించారు.

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు



విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో గురువారం ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఇన్స్పిరాన్- 2025 సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఇందులో రాష్ట్రంలోని 12 ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వారికి ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పేపర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి సాంకేతిక సదస్సుల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ సురేష్‌రెడ్డి, కార్యక్రమం కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గోకులకృష్ణ ఫార్మశీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలోని గోకులకృష్ణ ఫార్మశీ కళాశాలలో గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ బాలగాని పవన్‌కుమార్ తెలిపారు. 96 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రముఖ బల్క్ డ్రగ్ సంస్థ దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ కంపెనీ సీనియర్ హెచ్‌ఆర్ కె.రామకృష్ణ, బి.తిరుపతయ్య ఇంటర్వ్యూలు, రాత పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు విశాఖపట్నం, కాకినాడు, హైదరాబాద్‌లో వున్న కంపెనీల్లో పనిచేయాల్సి వుంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శివకుమార్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



కార్యవర్గాన్ని అభినందిస్తున్న న్యాయవాదులు

గూడూరు రూరల్ : గూడూరు కోర్టు హాల్‌లో గురువారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా సోమిశెట్టి ఉమాశంకర్, ఉపాధ్యక్షుడిగా కె.హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎం.వెంకటకృష్ణయ్య, కోశాధికారిగా ఎస్‌కే వహిద, లైబ్రరీ కార్యదర్శిగా యూసుఫ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా ప్రతాప్‌కుమార్, మహిళా ప్రతినిధిగా ఎస్‌కే నాగూర్, కార్యనిర్వాహక సభ్యులుగా నవకోటి, సుమన్, ఏడుకొండలు, పి.సుమన్, మహబూబ్‌బాష, సహాయ కార్యదర్శిగా మార్లెళ్ల శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

ఆకాశంలో మబ్బులు... ఆందోళనలో రైతులు



మల్లాంలో ధాన్యం రాశులపై పట్టలు కప్పిన రైతులు

చిట్టమూరు : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు కల్లాల్లోనే రాశులుపోసి కాపాడుకుంటున్నారు. ఈ క్రమంలో గురువారం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఆకాశం మేఘావృతమైంది. వర్షం పడితే ధాన్యం తడిసిపోయి మోసులు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో బీపీటీ-5204(పెద్ద మసూర) రకం వరి పంట సాగు చేశారు. ఈ రకానికి మద్దతు ధర లేదు. రైతులు నష్టాలకు దళారులకు అమ్ముకోలేక ఎండలో ఆరబెట్టుకుని తంటాలు పడుతున్నారు.

కండలేరులో 48.241 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 48.241 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కలగానే డబుల్ రోడ్డు

అభివృద్ధికి చిహ్నాలు రోడ్లు అని పెద్ద చెబుతూ ఉంటారు. రోడ్లు బాగుంటే రవాణా పెరుగుతుంది. వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. తద్వారా ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి రోడ్డు దశాబ్దాలుగా బాగుపడలేదు. వాహనాల రద్దీ పెరిగినా విస్తరణకు నోచుకోలేదు. రోడ్డును విస్తరిస్తామన్న మంత్రుల హామీలు నీటిమీద రాతలుగా మిగిలిపోయాయని స్థానికులు వాపోతున్నారు.

- దశాబ్దాలుగా బాగుపడని సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి రోడ్డు
- అమాత్యుల హామీలు గాలికి
- ట్రాఫిక్ పెరిగినా విస్తరణకు నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు



అధ్వానంగా ఉన్న సూళ్లూరుపేట- శ్రీకాళహస్తి సింగిల్ రోడ్డు



సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి రోడ్డులో స్తంభించిన వాహనాలు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట–శ్రీకాళహస్తికి రోడ్డు 19.5 కిలోమీటర్లు ఉంటుంది. ఈ రోడ్డు గుండా సూళ్లూరుపేట నుంచి శ్రీకాళహస్తికి వెళ్లడమే కాకుండా మండలంలోని మన్నారుపోలూరు, ఇలుపూరు, పెరిమిటిపాడు, కొండుంబట్టు, మంగళంపాడు, దామానెల్లూరు, మతకామూడి, ఉగ్గుమూడి, సుగ్గపల్లి, బుచ్చినాయుడు కండ్రిగ, సంతవేలూరు, కువ్వాకొల్లి, గాజుల పెళ్లూరు, పాధనవారిపాళెం, అయ్యవారిపాళెం, కళత్తూరు, వరదయ్యపాళెం, మరదవాడ తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అపాచితో పాటు పలు కంపెనీల బస్సులు సిబ్బందిని తీసుకెళుతూ ఉంటాయి. ఇది సింగిల్ రోడ్డు కావడం, ట్రాఫిక్ పెరగడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే జరిగిన అనేక రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది క్షతగాత్రులయ్యారు. ఈ రోడ్డును డబుల్‌గా మార్చాలని స్థానికులు దశాబ్దాల నుంచి కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేడు.

పెరిగిన వాహనాల సంఖ్య

గతంలో ఈ రోడ్డుపై ట్రాఫిక్ వుండేది కాదు. తడ, శ్రీసిటీ సెజ్‌లలో పరిశ్రమలు ఏర్పాటుకావడంతో ప్రస్తుతం రోజుకు సుమారు 10 వేలకు పైగా వాహనాలు తిరుగుతున్నాయి. ఈ క్రమంలో రోడ్డును విస్తరించాలన్న డిమాండ్ వచ్చింది. దీంతో సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బీ అధికారులు సర్వేచేసి సుమారు రూ.30 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పట్టుబట్టి సూళ్లూరుపేట నియోజకవర్గంలో చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి నుంచి పెరిమిటిపాడు వరకు డబుల్ రోడ్డు వేయించారు. మిగిలిన 13.5 కిలోమీటర్ల రోడ్డు సత్యవేడు నియోజకర్గంలో వుండడంతో దాని గురించి పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు దారుణంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

మంత్రుల మాటలు నీటి మూటలేనా!

గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీ మంత్రిగా పనిచేసిన పితాని సత్యనారాయణ ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వచ్చినప్పుడు ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే 2014–19 మధ్య మంత్రిగా పనిచేసిన పొంగూరు నారాయణ ఇలాగే హామీ ఇచ్చి వెళ్లిపోయారు. వాటిని నెరవేర్చిన పాపాన పోలేదు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గత ఏడాది ఆగస్టు 13న షార్‌లో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవానికి వచ్చారు. ఈ రోడ్డును డబుల్‌రోడ్డుగా విస్తరించేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తర్వాత ఆయన కూడా పట్టించుకోలేదు. ఇప్పటికైనా నాయకులు, పాలకులు రోడ్డును విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు.

రాత్రిళ్లు నరకం కనిపిస్తోంది



పెరిమిటిపాడు దాటిన తర్వాత రోడ్డు అధ్వానంగా ఉంది. రాత్రిళ్లు అటువైపు వెళ్లాలంటే నరకం కనిపిస్తోంది. కంపెనీల బస్సులతో ట్రాఫిక్ పెరిగింది. రోజుకు పది వేలు వాహనాలు తిరుగుతున్నాయి. సింగిల్ రోడ్డు కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా పాలకుల్లో స్పందన లేకుండా పోయింది.

\- పాల మురళీ, సూళ్లూరుపేట

భయం భయంగా వెళ్తున్నాం



సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే భయం భయంగా ఉంటుంది. బుచ్చినాయుడుకండ్రిగ దాకా ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని పోవాల్సి వస్తోంది. నా చిన్నతనం ఈ రోడ్డు సింగిల్‌గానే వుంది. ఎదురుగా వాహనం వస్తే కనీసం కిందకు దిగేందుకు కూడా వీలులేకుండా ఉంది.

\- తేరే రమణయ్య, కొన్నెంబట్టు

మేమున్నాం బృందం చేయూత

సూళ్లూరుపేట : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి గోవర్ధన్‌కు మేమున్నాం బృందం సభ్యులు గురువారం ఆర్థికంగా చేయూతనిచ్చారు. గోవర్ధన్ కుమార్తె క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న మేమున్నాం బృందం సభ్యులు తమవంతు సాయంగా రూ.90 వేలు అందజేశారు.

మౌలిక వసతుల కల్పన అభినందనీయం



కళాశాలకు కంప్యూటర్లు అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

చిల్లకూరు : పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ కింద పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. డీఎండబ్ల్యూ ప్రయివేట్ పరిశ్రమ యాజమాన్యం గురువారం సీఎస్ఆర్ నిధులతో గూడూరు రెండో పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 10 కంప్యూటర్లు అందజేశారు.

సీసీలు, వీవోఏల విచారణ

కలువాయి(సైదాపురం) : కలువాయి మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇటీవల షోకాజ్ నోటీసులు అందుకున్న ఇద్దరు సీసీలు, మెమోలు అందుకున్న కుల్లూరు వీవోఏలను బుధవారం నెల్లూరులో ఆర్డీఏ పీడీ నాగరాజు కుమారి విచారించినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొరమేను చేపల పెంపకంపై కలువాయిలో పనిచేస్తున్న ఏపీఎం, ప్రస్తుత కలువాయి ఎఫ్‌పీవోసీసీలను కూడా విచారించినట్టు సమాచారం. పొదుపు గ్రూపు సభ్యులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ సంఘబంధ నిధులు అవకతవకలపైనా వెలుగు కుల్లూరు వీవోఏ చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు మెమో జారీ చేశారు.

రాబోయే రోజులు మనవే

- కూటమి నేతలకు తొత్తులుగా పనిచేస్తున్న అధికారులను వదలం
- జగన్ 2.0లో కార్యకర్తలకే ప్రాధాన్యం
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం) : రానున్న రోజులు మనవేనని, ఎవరూ అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. రెడ్‌బుక్‌ను అమలుచేయడంలో కొంతమంది అధికారులు కూటమి నేతలకు తొత్తులుగా పనిచేస్తున్నారని విమర్శించారు. జమిలీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని, జగన్ 2.0లో తప్పు చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఇస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి, నాయకులు సదారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, రాజారెడ్డి, తొంటాల చిన్నా, వలికల కృష్ణయ్య, యస్థాని తదితరులు పాల్గొన్నారు.

కుట్రలో భాగమే వక్ఫ్ సవరణ బిల్లు

చిల్లకూరు : కుట్రలో భాగంగానే కేంద్ర పభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు తీసుకువచ్చిందని వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మగ్దూమ్ మొహిద్దీన్ ఆరోపించారు. ఆయన గురువారం గూడూరులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకే సవరణలు తీసుకువస్తోందని విమర్శించారు. పార్టీ గూడూరు నియోజకవర్గ అధ్యక్షుడు జలీల్ మాట్లాడుతూ దేశంలో ఉన్న ముస్లింలపై పాలకులకు కక్ష ఎందుకో తెలియడం లేదన్నారు. వారికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతు ఇవ్వడం శోచనీయమన్నారు. భవిష్యత్తులో మైనార్టీలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. నాయకులు కాలేషా, ఆల్తాఫ్, మస్తాన్‌సాహెబ్, రఫీ, మస్తాన్‌బాషా, అబ్దుల్లా, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిట్టమూరు : వైఎస్సార్ సీపీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం ఉంటుందని ఆ పార్టీ గూడూరు నియోజకవర్గ సమన్వయ కర్త, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయన గురువారం మల్లాంలో వైఎస్సార్ సీపీ నేత దువ్వూరు శేషరెడ్డి నివాసంలో అనుబంధ సంఘాల నియామకాలపై సమావేశం నిర్వహించారు. మండలంలో పార్టీ పటిష్టంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేసి రాబోవు ఎన్నికల్లో రెండో సారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామన్నారు.

మాజీ మునసబ్‌కు నివాళి

మండలంలోని మెట్టు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత అంబటి జనార్దన్ రెడ్డి తండ్రి మాజీ మునసబ్ చంద్రశేఖర్ రెడ్డి ఇటీవల మృతిచెందారు. గురువారం ఉత్తర క్రియలు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొని అంబటి చంద్రశేఖర్ రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి కస్తూర్ రెడ్డి, గూడూరు నియోజకవర్గ కల్చరల్ విభాగం అధక్షుడు వాకాటి అశ్విన్ రెడ్డి పాల్గొన్నారు.

పరిహారంలో సమన్యాయం పాటించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న జేసీ శుభంబన్సల్

చిల్లకూరు : క్రిస్ సిటీకి తీసుకున్న భూములకు పరిహారం ఇవ్వడంలో సమ న్యాయం పాటించాలని తమ్మినపట్నం, లింగవరం గ్రామస్తులు కోరారు. వారు గురువారం భూములను పరిశీలించడానికి వచ్చిన జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్‌ను అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ భూములు సేకరణ సమయంలో అందరికీ న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. సర్వేలో కొంతమందిని పక్కన పెట్టారని, సుమారు 200 ఎకరాలను బీడు భూములుగా చూపించారని వివరించారు. ఆ భూములను నమ్ముకుని గిరిజనులు, ఎస్సీలు బతుకుతున్నారని తెలిపారు. వారికీ పరిహారం ఇవ్వాలని కోరారు. స్పందించిన జేసీ మాట్లాడుతూ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెంకన్నపాళెంలో భూముల పరిశీలన

కోట : వెంకన్నపాళెంలో గర్భకండ్రిగ భూములను గురువారం జేసీ శుభంబన్సల్ పరిశీలించారు. ఈ గ్రామంలోని 340 ఎకరాల భూములకు రిజిస్ట్రేషన్, మ్యుటేషన్లు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై కొందరు రైతులు ఇటీవల కలెక్టర్‌కు వివరించి న్యాయం చేయాలని కోరారు. ఈ క్రమంలో జేసీ భూములను పరిశీలించారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనన్, తహసీల్దార్ జయజయరావు పాల్గొన్నారు.





ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అవిశ్వాస తీర్మానంలో నిబద్ధతతో పనిచేయండి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- మున్సిపల్ కౌన్సిలర్లకు నేదురుమల్లి దిశానిర్దేశం

వెంకటగిరి రూరల్ : ఈ నెల 9న జరగనున్న మున్సిపల్ చైర్మన్ అవిశ్వాస తీర్మానంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు నిబద్ధతతో పనిచేయాలని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం వెంకటగిరిలోని తన నివాసంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కౌన్సిలర్లు అందరూ ఏకతాటిపై నిలిచి చైర్‌పర్సన్‌గా నక్కా భానుప్రియను కొనసాగించుకుందామన్నారు. కూటమి నేతలు కక్ష సాధింపులు, బెదిరింపులకు ఎవరూ భయపడొద్దన్నారు. ప్రలోభాలకు గురికావొద్దని సూచించారు. గత శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తనకు జరిగిన అవమానాన్ని పారవోలు ఎంపీటీసీ పుల్లూరు శ్రీదేవి ధైర్యంగా ఎదుర్కొన్నారని వివరించారు. కౌన్సిలర్లు కూడా కూటమి నేతల బెదిరింపులను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

ఘనంగా గంధోత్సవం



అమీర్ షావలీ దర్గాలో పూల చద్దా కప్పుతున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని హజరత్ అమీర్‌షావలీ గంధోత్సవం ఘనంగా ప్రారంభమైంది. దర్గా కమిటీల వివాదాలతో తొమ్మిదేళ్లుగా ఆగిపోయిన గంధోత్సవం, ప్రజాప్రతినిధుల చర్చలతో ఈ ఏడాది మళ్లీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి శ్రీవారి గంధాన్ని బజారు వీధిలోని దోర్నాదుల చెంచుకృష్ణయ్య నివాసం వద్ద నుంచి సప్పరంపై మంగళ వాయిద్యాలు, ఫకీర్ల విన్యాసాలు, బాణసంచా వేడుకల నడుమ పట్టణంలో ఊరేగించారు. శుక్రవారం తెల్లవారుజామున దర్గా వద్దకు శ్రీవారి గంధాన్ని చేర్చి ఫాతేహాలు నిర్వహించి, భక్తులకు గంధం పంపిణీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. శుక్రవారం రాత్రి సినీ పాటకచేరి, శనివారం మధ్యాహ్నం అన్నదానం, రాత్రి జబర్దస్త్ ఫేమ్ బుల్లి తెర నటులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



దర్గా వద్ద విద్యుత్ దీపాలంకరణ

పశుపోషకులకు ఊరట

చిల్లకూరు : పశువుల ప్రమాద బీమా ప్రీమియంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించినట్టు గూడూరు పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సురేష్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ పశువుల విలువ ఒక్కోదానికి ఒక్కో విధంగా ఉంటుందన్నారు. అవి మృతి చెందినప్పుడు పశుపోష కులు నష్టపోకుండా ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తోందన్నారు. ఇందుకోసం గతంలో చెల్లించే ప్రీమియం కన్నా ప్రస్తుతం తగ్గించినట్టు తెలిపారు. గతంలో పశుపోషకుల వాటా 20 శాతం ఉండేదన్నారు. ప్రస్తుతం 15 శాతానికి తగ్గినట్టు తెలిపారు. గేదెలు, ఆవులకు గతంలో మూడేళ్లకు రూ.30 వేలకు బీమా చేసుకుంటే రూ.1,920 చెల్లించాల్సి ఉండేదని, రైతు వాటా కింద రూ.384లు, కేంద్ర ప్రభుత్వం రూ.922, రాష్ట్ర ప్రభుత్వం రూ.614లు చెల్లించేదన్నారు. ఇప్పుడు రైతు రూ.288లు చెల్లిస్తే సరిపోతుందన్నారు. అలాగే గొర్రెలు, మేకలు, పందులకు గతంలో ఏడాదికి రూ.6 వేలకు బీమా చేస్తే రూ.180 చెల్లించాల్సి వచ్చేదన్నారు. ఇందులో రైతు వాటా కింద రూ.144లు చెల్లించేవారని, ప్రస్తుతం రూ.27లు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ప్రతి ఒక్క రైతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమీర్‌షావలీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముజావర్లు



దర్గా వద్దకు ఊరేగింపుగా వస్తున్న యువకులు, పక్కీర్లు



ముజావర్ల ప్రత్యేక ప్రార్థనలు

నాయుడుపేట పట్టణంలోని హజరత్ అమీర్‌షావలీ దర్గాలో గురువారం సాయంత్రం ముజావర్లు సుభాని, హిదయతుల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు(ఫాతేహాలు) చేసి ఉరుసు వేడుకలను ప్రారంభించారు. చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో దర్గా వద్దకు తరలివచ్చి పాతేహాలు చేపట్టారు. గంధం ఊరేగించే ప్రాంతాలను తిరుపతి ఏఎస్పీ రవిమనోహరాచారి పరిశీలించారు. కార్యక్రమాల్లో దర్గా కమిటికు చెందిన నిజాం, సుభహాని తదితరులు పాల్గొన్నారు. - నాయుడుపేట టౌన్



పోలీసులకు సూచనలు చేస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి